
# సిబ్బంది ఇష్టారాజ్యం



**ధర్మపురి –నవభూమి:** లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఏటా రూ.10 కోట్ల ఆదాయం సమకూరుతున్నా..భక్తులకు ఎలాంటి వసతులు కల్పించడం లేదు. ఆలయంలో దశాబ్దాలుగా బదిలీలు లేని సిబ్బందితోపాటు ఇన్‌చార్జి అధికారులు కొనసాగుతున్నారు. దీనిపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించి.. ఆలయ అంతర్గత వ్యవహారాలపై దృష్టి సారించడంతోపాటు, నిలిచిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.వీఐపీలకే అధిక ప్రాధాన్యం..ఆలయంలో సామాన్య భక్తులకు సేవలు భారంగా మారాయి. వీఐపీలకు, సిబ్బంది పరిచయస్తులకు ఇస్తున్న ప్రాధాన్యం.. సామాన్యులకు ఇవ్వడం లేదు. దేవస్థానంలోని కొందరు సిబ్బంది, రక్షణ గార్డులు కుమ్మక్కై దర్శనానికి సంబంధించి అవకతవకలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో.. భక్తులకు సదుపాయాలపై శ్రద్ధ పెట్టడం లేదని తెలుస్తోంది. గతంలో బయోమెట్రిక్ విధానాన్ని రూపొందించినా.. అనంతరం యంత్రాలు మూలన పడ్డాయి. మరోవైపు ఆలయంలో జరిగిన వివాదాస్పదన ఘటనలను సీసీ కెమెరాల రికార్డుల నుంచి సిబ్బంది తొలగిస్తున్నారని.. కేవలం స్వీయ రక్షణకే ఇవి ఉపయోగపడుతున్నాయనే ఆరోపణలున్నాయి.సామగ్రి లెక్కల్లో తేడాలు..ఆలయానికి వెనుకవైపు ద్వారం ఉండగా.. లోనికి ఎవరు వస్తున్నారనే దానిపై దృష్టి నిలపడం లేదు. దీంతో భక్తులు ఆలయ రక్షణపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ద్వారం నుంచి ఆలయానికి చెందిన సరుకులు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఆకస్మికంగా గతేడాది తనిఖీ చేయగా పలు లోపాలు బయటపడ్డాయి. రిజిస్టర్‌లో నమోదైన వాటికి.. నిలువ ఉన్న సరుకులకు, బియ్యానికి భారీ తేడా ఉందని కమిషనర్ తన నివేదికల్లో పేర్కొన్నారు. అయితే నివేదిక ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు విస్మరించారు. వెనుక ద్వారాన్ని పూర్తిగా మూసివేయాలని పోలీసులు సూచించినా.. ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా..ఆలయంలో ఉదయం అభిషేకం, హోమం, నిత్య కళ్యాణోత్సవం, విశేష అర్చనలు ఇలా ప్రతి దానిలోనూ భక్తులకు సేవలు భారంగా మారుతున్నాయి. టికెట్ల ధరలను పెంచినా.. పూజల అనంతరం పలువురు డబ్బులు పుచ్చుకుంటున్నారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం భక్తుల నుంచి డబ్బులు ఆశించరాదు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నా.. అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆలయ ప్రాంగణంలోని దుకాణదారులు సామగ్రిని ఇష్టారాజ్యంగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.ఏళ్ల తరబడి బదిలీలు లేవు ఓ వైపు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో ఉద్యోగులు బదిలీ అయ్యారు. లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మాత్రం ఒక్కో సిబ్బంది ముప్పై ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. రెగ్యులర్, తాత్కాలిక సిబ్బంది కలిపి మొత్తం 50 మంది వరకు ఉన్నారు. వీరిలో కొంతమంది డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయిదు లేదా ఆరుగురు బదిలీ కావచ్చని అధికారులే భావించినా.. చివరికి ఎవరూ కాకపోవడం గమనార్హం.లోపాలను సవరిస్తాం దేవస్థానంలో లోపాలను సవరించి, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం. భక్తులకు సేవలు భారంగా కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఆలయంలో పని చేసే సిబ్బందిపై పూర్తిస్థాయిలో నిఘా పెడుతున్నాం.

# కొత్త బృహత్ ప్రణాళిక





నవభూమి
కరీంనగర్
అనుబంధం
21 సెప్టెంబర్,2024 శనివారం పేజీలు:3
www.epaper.navabhoomi.in



# ఆహారభద్రతపై ఆశలు



**పెద్దపల్లి –నవభూమి:** లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్‌డీలర్ రేషన్‌కార్డు, ఆరోగ్య కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చేస్తాం.ఈనెల 19న ప్రజాప్రతినిధుల అభిప్రాయం తీసుకుంటాం. వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తాం. – మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వ్యాఖ్యలు.ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు కొలమానం చేశారు. రేషన్‌కార్డు లేకపోవడంతో అభివృద్ధి ఫలాలకు అర్హులైన పేదలు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు మిథ్యగా మారింది. కొత్త రేషన్‌కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం స్పష్టత ఇచ్చింది. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొనడంతో పేద వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.తుది దశకు విధి విధానాలు మంత్రి వర్గ ఉపసంఘంలో కొత్త రేషన్‌కార్డుల విధి విధానాల కూర్పు తుది దశకు చేరింది. పరిమితికి లోబడి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టారు. కొత్త రేషన్‌కార్డు క్యూఆర్ కోడ్/మైక్రో చిప్/బార్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డు ఉంటుంది. ఆదాయ, ఇతరత్రా అర్హతలపై చర్చలు కొనసాగుతున్నాయి.నిరీక్షణకు తెర గత కొన్నేళ్లుగా కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత కొద్ది రోజులుగా ఉపసంఘం పలు మార్లు భేటీ అయ్యింది. మార్గదర్శకాలపై కూలంకషంగా చర్చించారు. ఈనెల 19న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుని 21న మరోసారి సమావేశం చేపట్టనున్నారు. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరించి వడబోత చేపట్టనున్నారు.



# నాడు ప్రవేశాలకు.. నేడు హాజరుకు

## ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య విభాగం




**గోదావరిఖని-నవభూమి:** గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని ట్రాన్స్‌జెండర్ల క్లినిక్ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మహిళలు, పురుషుల కోసం వైద్య విభాగాలు, నిపుణులు సేవలందిస్తుండగా..అదే తరహాలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య సేవలందించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలోని ట్రాన్స్‌జెండర్ల వైద్య విభాగాన్ని మరింత ఆధునికీకరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రుల్లో (సార్వజనిక) ట్రాన్స్‌జెండర్ల కోసం 'మైత్రి క్లినిక్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా పట్టణ సార్వజనిక ఆసుపత్రిలో క్లినిక్‌ను ఏర్పాటుచేశారు.ముందుకు రావడం లేదు..క్లినిక్ ఏర్పాటు చేసినప్పటికీ.. ఆశించిన మేర ట్రాన్స్‌జెండర్లు వైద్య సేవలు వినియోగించుకోవడం లేదు. మహిళలు, పురుషులతో పోలిస్తే తమకు కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉంటాయని, కావున మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ట్రాన్స్‌జెండర్లు కోరుతున్నారు. ఈ మేరకు 'ఖని' ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ట్రాన్స్‌జెండర్లు తమ సమస్యలు విన్నవించారు. దీంతో ఆసుపత్రి పాత భవనం మొదటి అంతస్తులో వారికోసం ప్రత్యేక విభాగం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.లేజర్ చికిత్సలపై వినతి..ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 9వేలకు పైగా ట్రాన్స్‌జెండర్లు ఉండగా.. ఇందులో పెద్దపల్లి జిల్లాలో సుమారు 1600 వరకు ఉన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనే 300కు పైగా ట్రాన్స్‌జెండర్లున్నట్లు సమాచారం. అయితే ప్రధానంగా యూరాలజీ, చర్మ సమస్యలతోపాటు లేజర్ చికిత్సలను అందుబాటులోకి తేవాలని ట్రాన్స్‌జెండర్లు కోరుతున్నారు. సాధారణ ఓపీ విభాగంలోని వైద్యులకు తమ సమస్యలు చెప్పుకునేందుకు వెనుకాడుతున్నారు. పైగా సాధారణ మహిళలు, పురుషులతోపాటు వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు కొన్ని సందర్భాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఈ క్రమంలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయడంతోపాటు.. వారికి అవసరమైన అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తేవాల్సి ఉంది.

## బావులు... ప్రమాదాలకు హేతువులు

**ముస్తాబాద్ -నవభూమి:** అదుపు లేని వేగంతో రోజు రోజుకు ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. మరోవైపు ప్రధాన రహదారుల పక్కన, మలుపుల వద్ద ఉన్న బావుల చుట్టూ చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగాయి.బావుల ఆనవాళ్లు కనిపించడం లేదు. పొదల మధ్య ఉన్న ప్రమాదకర బావులతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.ముస్తాబాద్ మండలంలో గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల పక్కన, మలుపుల వద్ద వ్యవసాయ, నిరుపయోగంగా ఉన్న బావులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాటి చుట్టూ మొక్కలు, చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు.మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద రక్షణ గోడలు నిర్మించడం, నిరుపయోగంగా ఉన్న వాటిని పూడ్చివేయించడం చేయాలని కోరుతున్నారు. వాటి చుట్టూ ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.చీకోడ్ నుంచి మద్దికుంటకు వెళ్లే మలుపు వద్ద ప్రమాదకర బావి ముస్తాబాద్ నుంచి మద్దికుంట వెళ్లే రోడ్డు పక్కన చెట్ల పొదల మధ్యలో వ్యవసాయ, నిరుపయోగ బావులు ఉన్నాయి. అలాగే మద్దికుంట నుంచి చీకోడ్,

చీకోడ్ నుంచి మొర్రాయిపల్లె, మొర్రాయిపల్లె నుంచి ముస్తాబాద్ వచ్చే రహదారుల పక్కన బావులు ఉన్నాయి.తెర్లుమద్ది నుంచి సేవాలాల్‌తండా వెళ్లే రహదారిలో చెట్ల పొదల మధ్య ఇలా...ముస్తాబాద్ శివారు కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రోడ్డు పక్కన, తెర్లుమద్ది నుంచి సేవాలాల్‌తండా వెళ్లే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్నాయి. వీటితోపాటు పలు గ్రామాల్లో ప్రధాన రోడ్ల పక్కన బావులు ఉండటంతో రాత్రి వేళలో రయ్ రయ్‌మంటూ ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

# కొత్త బృహత్ ప్రణాళిక




**కరీంనగర్ -నవభూమి:** నగరాలు, పట్టణాల్లో సమగ్రాభివృద్ధి, భవిష్యత్తు అవసరాల కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు తయారు చేయడం కోసం కొత్త ప్రణాళిక అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది.రెండేళ్ల క్రితమే మాస్టర్ ప్లాన్ తయారు ప్రక్రియను ప్రారంభించారు. సాంకేతిక కారణాలతో నిలిపివేయగా మళ్లీ ఈ అంశం తెరపైకి వస్తోంది.కరీంనగర్ నగరపాలక సంస్థ, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) పరిధిలో పట్టణీకరణ పెరిగింది. నగరంలో విలీన గ్రామాలు కలిశాయి. గ్రామాల్లో సైతం పట్టణ స్థాయిలో వసతుల కల్పన జరుగుతోంది. కాలనీల సంఖ్య పెరిగిపోవడంతో ఎక్కడ పడితే అక్కడ లేఅవుట్ లేకుండా స్థలాలు కొనుగోలు చేయడంతో అనేక సమస్యలకు కారణంగా మారుతోంది. అమృత్ నగరంతో పాటు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో కొత్త బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ప్రకారం రహదారులు కొలతలు, పార్కులు, సామాజిక స్థలాలు, ప్రభుత్వ స్థలాల గుర్తింపు, పారిశ్రామిక ప్రాంతం, నివాసిత, వాణిజ్య ప్రాంతాలు సులువుగా గుర్తించి అనుమతులు ఇచ్చే అవకాశముంటుంది. ఇప్పటికే బేస్ మ్యాపు తయారు కొత్త ప్రణాళికను తయారు చేసేందుకు వీలుగా రెండేళ్ల క్రితమే ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. భౌగోళిక సమాచార విధానం (జియో గ్రాఫికల్ ఇన్ఫరేషన్ సిస్టమ్) జీఐఎస్ విధానంలో మాస్టర్ ప్లాన్ సర్వే చేపట్టారు. నివాసిత, వాణిజ్య ప్రాంతాలు, రోడ్లు, భవనాల ఎత్తు, మురుగునీటి కాలువలు, ప్రభుత్వ స్థలాలు పలు వివరాలతో బేస్ మ్యాపు తయారు చేశారు. నగరపాలిక, సుడా పరిధిలో జీఐఎస్ ఆధారిత ప్రణాళికపై తుది కసరత్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో అప్పటి కలెక్టర్, నగర మేయర్ సునీల్‌రావు, అప్పటి సుడా ఛైర్మన్ అధ్యక్షతన పలుమార్లు సమావేశాలు కూడా నిర్వహించారు.27 ఏళ్ల నాటిదే అమలు కరీంనగర్ నగర పరిధిలో 1997లో ఆమోదించిన పట్టణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ ఇరవై ఏళ్లకు ఒకసారి దీన్ని తయారు చేయాల్సి ఉంటుంది. నాటి పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే భవన అనుమతులు, రహదారుల విస్తరణకు వాడుతున్నారు. జిల్లాలో కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు అయ్యాయి. కొన్ని గ్రామాలు విలీనమయ్యాయి. సరిహద్దులు మారాయి. కొత్త ప్రణాళికలు తప్పనిసరిగా మారింది.ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ కొత్త మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు అమృత్ పథకం నిధులు కేటాయించనుంది. డిసెంబరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే ఆ పథకం గడువు ముగుస్తోంది. ఆ తర్వాత ఎవరికి వారు నిధులు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుంది. నెలాఖరులోగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, కార్పొరేటర్లు, అన్ని విభాగాల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రజాభిప్రాయాన్ని తీసుకొని మార్పులు చేర్పులుంటే పరిగణలోకి తీసుకుంటారు. అందరి అభిప్రాయం మేరకు, గడువులోగా మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు.తీరనున్న ఇబ్బందులు మాస్టర్‌ప్లాన్ అమలు జరిగితే సుడా పరిధితో పాటు నగరంలోని విలీన కాలనీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ఇంటి అనుమతులు సులువుగా పొందే వీలుంటుంది.గతంలో తీగలగుట్టపల్లి బఫర్ జోన్‌లో ఉండేది. అక్కడ రైల్వేస్టేషన్ ఉండటంతో పారిశ్రామిక ప్రాంతంగా నగరపాలికలో ఉంది. దీనిని సవరిస్తే నివాసిత ప్రాంతంగా మారనుంది.నగరంలో రహదారులు, భవనాల శాఖ పరిధిలోని వంద అడుగుల రహదారి ఉంది. రహదారి విస్తరించడంతో మిక్స్‌డ్ యూజ్‌లోకి తీసుకుంటారు.కట్టరాంపూర్‌లో వ్యవసాయ భూమి ఉండగా అది రెసిడెన్షియల్ కిందికి వస్తోంది.కోతిరాంపూర్‌లో కొంత ప్రాంతాన్ని వాణిజ్య ప్రాంతంగా పరిగణలోకి తీసుకునే వీలుంది.భగత్‌నగర్ గోదాముల వెనుకాల ఉన్న ప్రాంతంలో ఇంటి అనుమతులే ఇవ్వడం లేదు. అక్కడ ప్రస్తుతం అన్ని నివాసిత ఇళ్లు నిర్మించుకున్నారు. అలాంటి ప్రాంతాన్ని మార్చుకోవచ్చు.సుడాతో పాటు, నగరంలోని అన్ని వీధి రహదారులు ఇక మీదట 30 అడుగులకు ఉండనున్నాయి.

# అన్నదాత సేద్యానికి అడ్డంకులు

**కరీంనగర్ -నవభూమి:** 21వ డివిజన్ సీతారాంపూర్ శివారులోని ఎస్సారెస్పీ కాలువ దుస్థితి కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఎస్సారెస్పీ డి-94 కాలువ ఆయకట్టు రైతులు వానకాలం, యాసంగి పంటలకు సరైన నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాల్వలో నాచు పేరుకుపోవడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు.మురుగు చేరి.. అధ్వానంగా మారి..కొత్తపల్లి మండలం మల్కాపూర్ నుంచి వచ్చే డి-94 కాలువ రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి మీదుగా వెళ్తోంది. కరీంనగర్ గ్రామీణ మండల పరిధిలో 5,293 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. అయితే రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి వద్ద మురుగు నీరు నేరుగా ఈ కాల్వలోకి చేరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. పైపెచ్చు కాల్వలో నాచు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి. ఎక్కువ మోతాదులో నీటిని విడుదల చేస్తే సీతారాంపూర్, రేకుర్తి వద్ద కాల్వ కట్టలు తెగిపోతున్నాయి. రైతులు ఎస్సారెస్పీ అధికారులకు మొరపెట్టుకున్నా నగరపాలక సంస్థ తీరుతో సమస్య పరిష్కారం కనుచూపుమేరలో కానరావటం లేదు. ప్రస్తుత వానకాలంలో కాల్వనీటి ఆధారంగా, వర్షాధారంగా పలు గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు వేశారు. బావులు, బోర్లు లేని పంటలు ఎడే పరిస్థితి పలు గ్రామాల్లో నెలకొంది.ఎక్కడ వేసిన గొంగళి అక్కడే! గతంలో కాల్వ నీటిని పరిశీలించిన ఎస్సారెస్పీ అధికారులు నగరపాలక సంస్థ మురుగు నీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడుదల చేయడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.అధికారులు నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి సమస్య తాత్కాలిక పరిష్కారం కోసం కాల్వలో పేరుకుపోయిన నాచును తొలగించాలని సూచించారు.నాచును తొలగించటానికి నగర పాలక సంస్థ టెండర్లు పిలిచింది. రూ.4.85 లక్షలతో వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభించారు.వేరేశాఖ పనులను నగరపాలక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఎలా చేస్తుందని విమర్శలు రావటంతో ప్రారంభించిన మరుసటి రోజే టెండర్ రద్దు చేసుకొని పనులను నిలిపివేశారు.ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నగరపాలక సంస్థ మురుగునీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడవడం, వ్యర్థాలు తొలగిస్తామని చెప్పి మళ్లీ రద్దు చేసుకోవటంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం నగర పాలక సంస్థ కాల్వలో వ్యర్థాలు తొలగించటానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. మరుసటి రోజే టెండరు రద్దు చేసుకున్నట్లు తెలిసింది. కాలువలోకి మురుగు నీరు విడుదల చేయడంతో ఆయకట్టు పంటలకు సక్రమంగా నీరందటం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.



## ఆక్రమణల పర్వం.. చర్యలకు రంగం సిద్ధం



**గోదావరిఖని, –నవభూమి:** ఖనిలోని సింగరేణి నివాస గృహాలు. పక్కనే వాణిజ్య దుకాణాలు సింగరేణికి సంబంధించిన విలువైన భూములు, నివాస గృహాలు ఆక్రమణకు గురవుతున్నాయి.వాటిని రక్షించుకోవడానికి సంస్థ సిద్ధమవుతోంది. ఇప్పటివరకు సింగరేణికి చెందిన వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. పారిశ్రామిక అవసరాలకు ప్రభుత్వం, ప్రైవేటు వారినుంచి సేకరించిన లక్షల ఎకరాల భూములు హద్దులు లేకుండా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో వాణిజ్య కేంద్రాలు ఉండటంతో.. అక్కడివారు ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ సహకారంతో ముందుకు..సింగరేణికి చెందిన భూములు, నివాస గృహాలను కాపాడుకోవడానికి హైడ్రా తరహాలో చర్యలు తీసుకోవడానికి సంస్థ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో చెరువులను కబ్జా చేసి, చేపట్టిన భవనాలను ఏ విధంగా కూల్చివేశారో.. అదే మాదిరిగా ఇక్కడ తొలగించేలా పరిశీలిస్తుంది. గోదావరిఖని నడిబొడ్డున ఉన్న సింగరేణి స్థలాన్ని ఆక్రమించుకుని వాణిజ్య భవనాలు నిర్మించారు. దీనిపై సంస్థకు, నిర్మాణాలు చేపట్టినవారికి మధ్య కోర్టులో వివాదం నడుస్తుంది. ఇదే స్థలంలో గతంలో సంస్థకు చెందిన నిర్మాణాలుండేవి. వాటిని కూల్చివేసిన అనంతరం ప్రైవేటు వ్యక్తులు అవి తమ భూములని అందులో నిర్మాణాలు చేపట్టారు. అలాగే బెల్లంపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో కూడా వాణిజ్య భవనాలు నిర్మించుకున్నారు. దీనిపై సింగరేణి సీఎండీ బలరాం.. ప్రత్యేకంగా అధికారుల సమీక్షలో దీనికి సంబంధించిన వాటిపై చర్చించారు. వీటన్నింటినీ పరిరక్షించుకోవడానికి ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుంది.నివాస గృహాలపై అయోమయం..మరోవైపు సింగరేణి క్వార్టర్లకూ రక్షణ లేకుండా పోయింది. కొత్తగూడెం, బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాల్లోని చాలావరకు సంస్థ నివాస గృహాలను కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని నివసిస్తున్నారు. ప్రభుత్వ శాఖలకు చెందిన మరికొంతమంది స్వాధీనం చేసుకుని.. సంస్థకు సంబంధం లేకుండా వినియోగించుకుంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా సంస్థకు 55 వేల నివాస గృహాలున్నాయి. కొత్తగా భూపాలపల్లి, సత్తుపల్లి ప్రాంతాల్లో ఉద్యోగుల కోసం క్వార్టర్లు నిర్మించింది. ఇవి కాకుండా సింగరేణి ఆవిర్భావ సమయంలో నిర్మించిన కొన్ని క్వార్టర్ల వివరాలు సంస్థ వద్ద లేకుండా పోయాయి. అందులో ఎవరు నివాసం ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.శిథిలావస్థకు చేరువలో..సింగరేణికి చెందిన చాలావరకు నివాస గృహాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం కార్మికులు తక్కువగా ఉండటంతో.. గతంలో నిర్మించిన క్వార్టర్లలో ఎవరూ నివాసం ఉండటం లేదు. దీంతో అవి నిర్వహణకు నోచుకోకపోవడంతో తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి.

## బఫర్ జోన్ సర్వే.. సగంలోనే ఆపేశారు

**వేములవాడ –నవభూమి:** మూలవాగు ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగు పరీవాహక ప్రాంతంలో బఫర్‌జోన్‌ను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసేందుకు చేపట్టిన సర్వే మధ్యలో ఆగిపోయింది.మొదట్లో ఉత్సాహంగా చేపట్టిన అధికారులు ప్రస్తుతం నిలిపివేయడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే కొనసాగుతుందని అధికారులు చెబుతున్నా సిబ్బంది జాడ మాత్రం కనిపించడం లేదు. దీంతో మళ్లీ పాత కథే పునరావృతం పూర్తయ్యే అవకాశాలున్నాయని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.పట్టణంలో మొదటి బైపాస్ రోడ్డులోని మహాలక్ష్మి వీధి ప్రాంతం నుంచి మూలవాగు వంతెన వరకు, అక్కడి నుంచి రెండో బైపాస్ రోడ్డులోని బతుకమ్మ తెప్ప నుంచి మాజీ ఎమ్మెల్యే ఇంటి ప్రాంతం మీదుగా పట్టణ పరిధిలోని మూలవాగు మొత్తం సర్వే చేసి హద్దులు నిర్ణయించేందుకు అధికారులు ఈనెల 11న సర్వే ప్రారంభించారు. మొదటి బైపాస్ రోడ్డులో నీటిపారుదల, సర్వే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు గతంలో బఫర్ జోన్‌ను గుర్తించేందుకు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చినప్పటికీ చర్యలు చేపట్టలేదు. దీంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈసారి అయినా సర్వే పూర్తవుతుందని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగులుతోంది. దాదాపు పది రోజులైనా సర్వే పూర్తి చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రేరణ పెరగాలి!

**కరీంనగర్ –నవభూమి:** దిల్లీలో జరిగిన జాతీయ ప్రేరణ మనక్ ప్రదర్శనలో ఆవిష్కరణతో రాజన్న సిరిసిల్ల జిల్లా కెఆర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి హేమంత్ పాఠశాలల స్థాయిలోనే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని రగిలించి వారితో కొత్త ఆవిష్కరణలను చేయించాలనే లక్ష్యంతో రూపొందించిన ప్రేరణ (ఇన్‌స్పైర్ మనక్) కార్యక్రమానికి కొన్ని పాఠశాలల విద్యార్థులే ఆసక్తి చూపుతున్నారు.. పలు సమస్యలకు పరిష్కారం చూపేలా ఆవిష్కరణలు చేస్తున్నారు. కానీ చాలా పాఠశాలలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటున్నాయి.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రేరణ మనక్ అవార్డుల కోసం పాఠశాలల విద్యార్థుల నుంచి ఆవిష్కరణల నామినేషన్లను స్వీకరిస్తున్నారు. గడువు ముగిసే సమయానికి జిల్లాల వారీగా నామినేషన్ల లక్ష్యాలకు పాఠశాలలు దూరంగా నిలిచాయి. దీంతో ప్రభుత్వం వచ్చే నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నామినేషన్లు రిజిస్ట్రేషన్లు చేసుకునే గడువును పొడిగించింది. ఇప్పటికైనా అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో నామినేషన్లను రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాల్సిన అవసరముంది.సగం దాటని లక్ష్యం...అధికారుల ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రేరణ మనక్ అవార్డుల కోసం నామినేషన్లను సమర్పించేందుకు 1209 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలున్నాయి. ఒక్కో పాఠశాలలో 5–10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కనీసం ఆవిష్కరణల 5 నామినేషన్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధనను పెట్టారు. దీని ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,045 నామినేషన్ల రిజిస్ట్రేషన్లను విద్యాశాఖ లక్ష్యంగా సూచించింది. ఈ విద్యా సంవత్సరం నామినేషన్ల ప్రక్రియ జులై 1న ప్రారంభమై ఈ నెల 15తో ముగిసింది. కానీ లక్ష్యంలో 50 శాతం ప్రతిపాదనలు కూడా దాటలేదు. మొత్తం 2,337 నామినేషన్లు ఈ నెల 18నాటికి రిజిస్ట్రేషన్ అయినట్లు విద్యాశాఖ వివరాలు తెలుపుతున్నాయి. ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటాన్ని గమనించిన రాష్ట్ర విద్యాశాఖ రిజిస్ట్రేషన్ల తుది గడువును వచ్చే నెల 15వ తేదీ వరకు పొడగించారు.ఎందుకీ పరిస్థితి కొన్ని పాఠశాలలు, విద్యార్థులు మాత్రమే ఈ ఆవిష్కరణలపై దృష్టి పెడుతున్నారు. ప్రైవేటులోనూ కార్పొరేట్ బడులు ఆసక్తి చూపిస్తుండగా మిగతా పాఠశాలలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.ప్రభుత్వ పాఠశాలల్లో కొంతమంది ఉపాధ్యాయులు ఆసక్తి చూపిస్తున్నా కొన్ని తరగతుల్లో విద్యార్థులు తక్కువగా ఉండటం, ఉన్న విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు లేకపోవడం తదితర ప్రతిబంధకాలు నెలకొన్నాయి.బాలలు తయారు చేసిన ప్రాజెక్టులు, ఆవిష్కరణలతో సైన్స్, వైజ్ఞానిక మేళాలను అర్భాటంగా నిర్వహిస్తున్న ప్రైవేటు



పాఠశాలలు ప్రేరణ మనక్ ప్రదర్శనల వైపు వారిని అడుగులు వేయించడంపై దృష్టి పెట్టడం లేదు.ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ విషయంలో దృష్టి సారించి విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరముంది. జిల్లా విద్యాశాఖల అధికారులు కూడా అనాసక్తి చూపుతున్న పాఠశాలలపై దృష్టి సారించి అందరూ ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించాలి. ఈ విషయమై కరీంనగర్ జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డితో మాట్లాడగా గడువు పొడిగించినందున అన్ని పాఠశాలలు ఆవిష్కరణల నామినేషన్ల రిజిస్ట్రేషన్లను పెంచేలా కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ఆ వైపుగా ప్రోత్సహించాలని సూచించారు.

# నాడు ప్రవేశాలకు..నేడు హాజరుకు

**జగిత్యాల–నవభూమి:** పక్కా భవనాలు..విశాలమైన మైదానాలు.. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా బోధన..ఉత్తమ ఫలితాలు ఉన్నాయంటూ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి విద్యార్థులను చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థులు కళాశాలలకు హాజరుకాకపోవడంతో అధ్యాపకులు మరోసారి ఇంటింటికీ తిరుగుతున్నారు. కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచి సీట్లను భర్తీ చేయడమే లక్ష్యంగా ఇంటర్ విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించి విద్యార్థులను చేర్పించింది. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ప్రథమ సంవత్సరంలో దాదాపు రెండు వేల మందికి పైగా విద్యార్థులు చేరారు. మూడు నెలలు గడుస్తున్నా కళాశాలకు హాజరుకాకపోవడం అధ్యాపకులకు తలనొప్పిగా మారింది. హాజరు శాతం పెంచేందుకు అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులకు నోటీసులు జారీ చేస్తున్నారు.తల్లిదండ్రులకు నోటీసులు ఒక్కో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలో ఉత్తీర్ణత, సాధించిన ప్రగతి రూపొందిస్తూ కరపత్రాలు, బ్యానర్లు ప్రదర్శిస్తూ అధ్యాపకులు ఇంటింటికీ అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన విద్యార్థులు తరగతులకు హాజరు కాకపోవడంతో వారి తల్లిదండ్రులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన మీ కుమారుడు సరిగా రావడంలేదు, నిత్యం కళాశాలకు పంపించాల్సి ఉంటుంది. కనీసం 75 హాజరు శాతం లేకపోతే వార్షిక పరీక్ష ఫీజు తీసుకోకపోవడమే కాకుండా ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు అనర్హుడు అవుతాడు. గమనించి కళాశాలకు నిత్యం వచ్చేలా చూడగలరంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి అంగీకార పత్రం తీసుకుంటున్నారు. దీనివల్ల కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడం, మున్ముందు ఇబ్బందులు తలెత్తకుండా ఉండడమే కాకుండా ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని అధ్యాపకులు భావిస్తున్నారు.విద్యార్థుల తల్లిదండ్రులకు నోటీసు అందిస్తున్న అధ్యాపకులు ఆకలితో అవస్థలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థులు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఉంటున్నారు. అత్యధికంగా బాలికలు ఉండగా ఉదయం కళాశాలకు వస్తే సాయంత్రం ఇంటికి చేరుకోవాల్సి ఉంటుంది. గ్రామాల నుంచి సరైన రవాణా సదుపాయం లేకపోవడం, ఉదయం తినొచ్చిన విద్యార్థులు సాయంత్రం వరకు ఆకలితో ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విధంగా మధ్యాహ్న భోజనం అందించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ ఇప్పటికీ సాధ్యమవ్వడంలేదు. మధ్యాహ్న భోజనం అందిస్తే ప్రభుత్వ కళాశాలల్లో హాజరు శాతం పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.హాజరు శాతం మెరుగు విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడంతో తల్లిదండ్రులకు నోటీసులు అందిస్తున్నాం. దీనిద్వారా కొంత ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తే విద్యార్థుల ప్రవేశాలు మరింత పెరగనున్నాయి.

